నూరేళ్ళ తెలుగు కథకు
**నవ్య నీరాజనం- 46**
నూరేళ్ళ తెలుగు కథకు




# తెలుగు రచయితలకు జాతీయస్థాయిలో తగినంత గుర్తింపు లేదు

**- అక్కిరాజు రమాపతిరావు (మంజుశ్రీ)**

కథకుడిగా, నవలాకారుడిగా మూడుపదుల వయసు నిండకముందే ప్రసిద్ధుడాయన. చాలామంది ప్రసిద్ధుల జీవిత చరిత్రలు ప్రచురించారాయన. అంతే కాదు, అయన పరిశోధకుడు, విమర్శకుడు, సాహిత్య చరిత్రకారుడు.. వంద పుస్తకాలను ప్రచురించిన వాడు. సాహిత్యంలోని అన్ని ప్రక్రియల్లో తన ముద్రను బలంగా వేసినవాడు. ఆయనే అక్కిరాజు రమాపతిరావు. 'మంజుశ్రీ'గా ప్రసిద్ధులయిన వీరి గురించి ఈ వారం..

## వారు సాధు జీవనులు

మా అమ్మానాన్నలు అన్నపూర్ణమ్మ, రామయ్యగారు. వారు సాధు జీవనులు. మేము అయిదుగురుం అన్నదమ్ములం. నేను 4 మే 1936న గుంటూరు జిల్లాలోని వేమవరంలో జన్మించాను. నరసరావుపేటలో స్కూలు, కాలేజీ చదువులు చదివాను. ఎం.ఏ, పిహెచ్‌డి ఉస్మానియా విశ్వవిద్యాలయంలో చేశాను.



భార్య రోహిణితో....

## ప్రథమ బహుమతిగా 'వైతాళికులు'

అవి నేను ఫిఫ్త్ ఫారమ్ చదువుతున్న రోజులు. అప్పుడు నాకు పధ్నాలుగేళ్ల వయసు. మాకు ఎస్సే రైటింగ్ నిర్వహించారు. అందులో నాకు ఫస్ట్ ప్రైజ్ వచ్చింది. మాకు హెడ్మాస్టర్ నాయని సుబ్బారావుగారు. నాకు 'వైతాళికులు' కవితా సంకలనం, కలం బహుమతిగా ఇచ్చారు. ఆ పుస్తకాన్ని అర్థం కాకపోయినా చదివేవాడిని. దానిని చదవడమే సంతోషం! అంచేత నాకు తెలియకుండానే కవిత్వం పట్ల ఆసక్తి ఏర్పడింది. రవీంద్రనాథ ఠాగూర్, శరత్ సాహిత్యాన్ని స్కూలు ఫైనల్ దాటకముందే చదువుకున్నాను. అలా వచన సాహిత్యం పట్ల కూడా ఆసక్తి ఏర్పడింది.

## నూరు పుస్తకాలు అచ్చయ్యాయి


నా పదిహేనేళ్ళ వయసున 'తెలుగు స్వతంత్ర'లో నా మొదటి రచన వచ్చింది. అది స్కెచ్చో, చిన్న కథో నాకిప్పుడు గుర్తు లేదు. 1953 నుంచి 1963 దాకా తెలుగు స్వతంత్రలో నావి నాలుగు నవలలూ, 50 చిన్న రచనలు వచ్చాయి. ఇందులో సాహిత్య వ్యాసాలూ, రెండు కవితలు ఉన్నాయి. ఆ తర్వాత 'తెలుగు స్వతంత్ర' ఆగిపోయింది. అప్పటినుంచి ఇప్పటి దాకా తక్కిన తెలుగు పత్రికలలో నేను రచనలు చేస్తూనే ఉన్నాను. దైనిక, వార, పక్ష, మాస పత్రికలలో ఈ 56 సంవత్సరాల కాలంలో నావి వెయ్యికి పైగా రచనలు వచ్చాయి. నా స్వంత రచనలైతేనేమి, నా కన్నా ముందు తరం గొప్ప రచయితలవైతేనేమి నేను నూటికి పైగా పుస్తకాలు నా పేరుమీద అచ్చులో చూసుకున్నాను.

## కేవలం సృజనాత్మక రచయితనే కాదు

కథ, నవల, సాహిత్య, చరిత్ర, విమర్శ, అనువాదం, జీవితచరిత్ర, పరిశోధన, సామాజిక చరిత్ర విశ్లేషణలో నేను చాలా రచనలు చేశాను. తొలి దశలో నాకు కథా రచనపట్ల ఆసక్తి ఉండేది కాని, ఇప్పుడు జీవిత చరిత్రల పట్ల ఇష్టం. తెలుగు మహనీయుల గురించి నేను 25మంది జీవిత చరిత్రలు ప్రచురించాను. నూట ఏభై వరకు గతమూడు ఏభైల కాలంలో తెలుగు వారి చరిత్ర, సమాజం, సంస్కృతి, స్వాతంత్ర్యోద్యమం, సాహిత్యం, నాటకరంగం, మేధావులకు సంబంధమున్న జీవిత రేఖా చిత్రాలు 'ప్రతిభా మూర్తులు' పేరుతో పుస్తకం తెచ్చాను. ఇప్పుడు నాకు, సృజనాత్మక రచయితగానే కాక పరిశోధకుడు, జీవిత చరిత్ర రచయితగా కూడా గుర్తింపు ఉంది.

## మోజుపడి ఆ పేరు పెట్టుకున్నాను

'మంజుశ్రీ' అని కలంపేరు పెట్టుకోవడంలో పెద్ద విశేషమేమీ లేదు. సాహిత్య ప్రభావ శీలమైన వయసున నాకు తెలిసిన జగత్తులో శ్రీశ్రీ, హితశ్రీ, ఉగ్రశ్రీ, ఉషశ్రీ, కరుణశ్రీ లాంటి రచయితల పేర్లు ఎక్కువ కనపడేవి. అట్లా మోజు పడి 'మంజుశ్రీ' అనే పేరు పెట్టుకున్నాననుకుంటా. అదీ కాక నేను పదిహేనేళ్ల వయసున చదివిన అడవిబాపిరాజు నవల 'హిమబిందు'లో 'మంజుశ్రీ' ఒక అప్రధాన పాత్ర. తర్వాతెప్పుడో తెలిసింది బౌద్ధమతంలో విద్యా, విజ్ఞాన వాగధిష్ఠాన దైవతమని. గొప్ప తపశ్శీలి అని. ఈ విషయం చిన్నప్పుడే తెలిసి ఉంటే ఆ పేరు జోలికి అసలు వెళ్లే వాణ్ణి కాను. పదిహేనేళ్ల పాటు సృజనాత్మక రచనల పట్ల ఉబలాటం, ఉత్కంఠ ఉన్న కాలంలో కలం పేరునే వినియోగించాను. ఆ తరువాత తెలుగు అధ్యాపక వృత్తిలో ప్రవేశించడం, పరిశోధన 'డిగ్రీ'కోసం ఇచ్చించడం జరిగిన తర్వాత అసలు పేరుతోనే ఎక్కువగా రాస్తున్నాను. అంటే 'గుట్టు' పేరు వదిలిపెట్టి 'పుట్టు' పేరుకు మారిపోయాను.



కుటుంబ సభ్యులతో....

## సాహిత్య జీవితంలో స్మరణీయ ఉదంతం

నా సాహిత్య జీవితంలో స్మరణీయ ఉదంతాలు చాలా ఉన్నాయి. ఆకాశవాణిలో నా గొంతు నేను రెండు వందల సార్లు వినగలిగాను. 1972లో నేషనల్ బుక్ ట్రస్ట్, భారతప్రభుత్వ యువజన శాఖల సంయుక్త నిర్వహణలో జరిగిన అఖిలభారత రచయితల సభలలో అన్ని భాషా రాష్ట్రాల నుంచి, అన్ని సాహిత్యాలనుంచి గొప్ప రచయితలు పాల్గొన్న సభలలో తెలుగు సాహిత్యం నుంచి పాల్గొన్న 9మంది ప్రతినిధులలో నేను ఒకణ్ణి. హరివంశరాయ్ బచన్, ఉమాశంకర్‌జోషి, కాళిందీచరణ్ పాణిగ్రాహి, తగళి శివశంకరపిళ్ళై, ఇందిరాగోపా

లస్వామి, అమృతా ప్రీతమ్ వంటి గొప్ప రచయిత(త్రి)లను అప్పుడే చూశాను. అన్ని భాషలనుంచి పాల్గొన్నవారు నూరు నూటేభై మంది ఉండ వచ్చు. అందరిలో నేనే చిన్నవాణ్ణి.

## నన్ను చూడ్డానికి కృష్ణశాస్త్రిగారు వచ్చారు

బహు పాఠాంతరత, బహు తాళపత్ర పరిశీలిత కవిత్రయ మహాభారతం ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగు శాఖ ప్రకటిస్తున్నప్పుడు 9 మహాభారత ప్రతులనుంచి 18 పర్వాలలో ఉన్న పాఠాంతరాలు సేకరించే అదృష్టం నాకు కలిగింది. అప్పుడు తంజావూరులో 2 నెలలున్నాను. తమిళనాడులో ఉన్న పుణ్యక్షేత్రాలను ఇంచుమించు దర్శించాను. కొంచెం అరవం నేర్చుకున్నాను. కాని అంతా మరిచిపోయినాను.

దేవులపల్లి కృష్ణశాస్త్రిగారు ఆకాశవాణి హైదరాబాదు కేంద్రంలో సాహిత్య ప్రయోక్తగా పని చేసేవారు. అప్పట్లో నావి ఏడెనిమిది కథలు ప్రసారం చేయించారు. అప్పట్లో చదివిన వాటిల్లో ఒక కథ బెంగాలీ, హిందీ, తమిళ, మలయాళ, కన్నడ భాషలలోకి అనువాదం పొందడం చూసి కృష్ణశాస్త్రిగారు సంతోషించారు. ఒకసారి ఆయన నన్ను బి.యెన్. రెడ్డిగారి దగ్గరకు తీసుకుని వెళ్లారు. కృష్ణశాస్త్రిగారు ఒకటి రెండు సార్లు మా ఇంటికి, ఒకటి రెండు సార్లు మా ఆఫీసుకి నన్ను చూడటానికి వచ్చారు.

## నాకున్నన్ని పరిచయాలు మరొకరికి ఉండవేమో!

ఇరవయ్యవ శతాబ్దంలో ఒక పదిమంది గొప్ప కవులలో నాయని సుబ్బారావుగారు ఒకరు. ఆయన హెడ్మాస్టరుగా ఉన్న హైస్కూల్లో నేను చదువుకున్నాను. అప్పటికే సుబ్బారావుగారికి వయసయిపోయింది. వారు నన్నెంతో ఆదరంగా చూసుకునేవారు. బహుశా నా తరం తెలుగు రచయితల్లో నాకున్న మహనీయుల పరిచయాలు మరొకరికి ఉండవేమో! ఒకసారి 'నేషనల్ హెరాల్డ్' సంపాదకులు ఎం.వి. చలపతిరావుగారికి నార్లవారు నన్ను పరిచయం చేశారు.

వారు నా భుజాలపై చేతులు వేసి నొక్కి, నా ముఖంలోకి చూస్తూ ''కోలవెన్ను రామకోటీశ్వరరావు గారిని చూడటానికి మీ నరసరావుపేట వచ్చానయ్యా'' అంటూ చాలా సంబరపడ్డారు.

అప్పాజోస్యుల-విష్ణుభొట్ల -కందాళం ఫౌండేషన్ (న్యూజెర్సీ-అమెరికా-చీరాల)వారి సాహిత్య కార్యక్రమాలకు పదేళ్లు ముఖ్య సంయోజకుడిగా, సలహా దారుడిగా పని చేశాను. పది విశిష్ట సమ్మాన సంచికలకు సంపాదకత్వం వహించాను. లక్ష రూపాయల నగదు పురస్కారం, నాలుగు రోజుల సాహిత్య కార్యక్రమాలు, సత్కార గ్రహీతల ప్రశంసా పత్రాలు రూపొందించాను. ఇది నా సాహిత్య జీవితంలో ఒక గొప్ప అవకాశం.

## అరుదైన సాహిత్య గౌరవాలు లభించాయి


బౌద్ధ త్రిపిటకాలనుంచి 200 పైన కథలు తెలుగు చేశాను. ఇవి ఒక ప్రముఖ తెలుగు దినపత్రికలో ఇప్పుడు వస్తున్నాయి. పాల్కురికి సోమనాథుడి బసవపురాణం, పండితారాధ్య చరిత్ర వచనంలో రాశాను. ఈ పని 8వందల ఏండ్లుగా ఎవరూ చేయలేదు. శ్రీమద్రామాయణానికి ఒక నిఘంటువు (పద వివరణ కోసం) తయారు చేశాను. నావి 2 నవలలు ఆకాశవాణి నుంచి ప్రసారమైనాయి. ఒక నవల చెన్నయ్ ఆకాశవాణి నుంచి కూడా ప్రసారమైంది. 50 ఏళ్ల కింద కొల్‌కత్తా ఆకాశవాణి కేంద్రనుంచి దుర్గపూజ విశిష్ట సంచికలో నా కథ బెంగాలీ అనువాదం అచ్చైంది. సుమారుగా 50, 60 సంవత్సరాల సాహిత్య జీవితంలో అరుదైన సాహిత్య గౌరవాలు నాకు లభించాయి.

## తెలుగు రచయితలకు జాతీయ స్థాయిలో తగినంత గుర్తింపు లేదు

మన వెయ్యేళ్ల తెలుగు సాహిత్యానికి, ముఖ్యంగా ఆధునిక సాహిత్య రీతులకు, మన ఆధునిక ప్రముఖ రచయితలకు జాతీయ స్థాయిలో గౌరవం, వ్యాప్తి, గుర్తింపు తగినంతగా లేదనే చెప్పాలి. ఆధునిక భారతీయ భాషా సాహిత్యాలలో తెలుగువారు ఎవరికీ తీసిపోరు. పురాగౌరవ చిరకాలపు విశిష్ట భాషగా తెలుగు గుర్తింపు పట్ల తమిళుల అక్కసు, అసూయ, అసహనం అర్థం లేనివి. సాహిత్య అకాడమీతో నాకు బాధ్యయుతమైన సాహిత్య సంబంధం ఏర్పడింది. అకాడమీ తరపున మన సాహిత్యానికి తగిన గుర్తింపు లభించేలా నావంతు ప్రయత్నం నేను చేస్తున్నాను. తెలుగు రచయితల రచనలు హిందీలో, ఇంగ్లీషులో చాలా వ్యాప్తికి రావాలి. అందుకు బాగా హిందీ, ఇంగ్లీషు రాయగలిగిన మనవాళ్లు నాకు సహాయం చేయాలి. తిరుమల రామచంద్ర, గడియారం రామకృష్ణ శర్మ గారల స్వీయ చరిత్రలు, హంపీ నుంచి హరప్పాదాకా, శతపత్రం నేను సంపాదకత్వం నిర్వహించి, విపుల పీఠికలతో ప్రచురింప చేశాను. వీటికి సాహిత్య అకాడమీ పురస్కారాలు లభించటం నాకెంతో తృప్తి, సంతోషం కలిగాయి.

## వీరేశలింగం డైరీలు, లేఖలు ప్రచురించాను

నా శ్రీమతి చి.ల.రోహిణి పెద్దగా చదువుకోక పోయినా, నా సాహిత్య కృషికి చేయూతే! మాకు నలుగురు సంతానం. ముగ్గురమ్మాయిలు, ఒక బ్బాయి. ముగ్గురు అమెరికాలో ఉన్నారు. అందరూ పెద్ద చదువులు చదివారు. మంచి ఉద్యోగాలు చేస్తున్నారు. ఇక వీరేశలింగంపై పి,హెచ్.డి. చేశాను. ఆయనపై డైరీలు, లేఖలు సంపాదించి ప్రచురించాను. నా పరిశోధన కృషి నా సమకాలపు రచయితలకు తెలుసు. హైదరాబాదులోని న్యూ సైన్సు కళాశాల, తెలుగు అకాడమీలలో 34 సంవత్సరాలు ఉద్యోగం చేసి 1994న ఉద్యోగ విరమణ చేశాను.



వేణుగాన విశారదుడు డా. ఏల్చూరి విజయరాఘవరావుతో...

## ఇప్పటి కథల్లో గాఢత ఉండటం లేదు

ఇప్పటి కథల్లో ప్రయోగాలు ఎక్కువ. వీటిల్లో వైచిత్రి ఉన్నది గానీ లోతయిన మానవ జీవిత చిత్రణ లేదు. సాహిత్యం వర్గాలుగా, వాదాలుగా విభక్తమయి పోతోంది. ఇది తప్పేమీ కాదు. దీని వలన వస్తువిస్తృతి పెరుగుతుంది. ఇది అవసరం కూడా. అయితే ఇతివృత్తంలో ఉండాల్సినంత గాఢత ఉండటం లేదు. పాత్రల ప్రవర్తనపైన ఆధారపడి కథలు వస్తున్నాయి కానీ, లోతుల్లోకి పోవడం లేదు. వాక్యనిర్మాణంలో గానీ, అనుభూతి గాఢతలో గానీ, సంలీనత కావడంలో కానీ ముందటి తరం అంత ప్రతిభావంతంగా ఇప్పటి కథలు రావటం లేదు. ఇప్పటి కథకుల్లో ఉత్సాహం ఉన్నంతగా ఉపజ్ఞ (గాఢమయిన ఫీలింగ్) ఉండటం లేదు.

**- విద్వాన్ వద్దిపట్ల రాజు**

## నాకు నచ్చిన నా కథ

# వానలో తడుస్తున్న మనిషి

- అక్కిరాజు రమాపతిరావు (మంజుశ్రీ)

**దురాశల ఆవలితీరాలు చేరుకున్న తర్వాత మనిషి. చిన్నతనం లోనే జీవితంలో మమకారాలు వదుల్చుకున్నవాడు. అమ్మ గుర్తువస్తే తప్ప యెప్పుడూ కన్నీళ్లు రానివాడు. ఎరుపురంగు పూసుకున్న పోస్టుడబ్బాలు కనపడితే భయపడేవాడు. వీధివెంట నడుస్తున్నాడు. తుడిచిపెట్టిన అద్దంలా వున్న సూర్యుడు కనపడటం లేదు. వానవచ్చేలా ఉంది. వానంటే భయం అతడికి. వానలో తిరగకూడదని, అనగా తడవకూడదని ప్రతిసారీ జబ్బుపడ్డప్పుడు చెప్పేవాళ్ళు మందులిచ్చే వాళ్ళు.**

చిన్నప్పుడెప్పుడో కుక్క కరిచిందతణ్ణి. అది పిచ్చికుక్క అన్నారెవ్వరో. అమ్మ కావిలించుకుని యేడ్చింది.

వానవచ్చే సూచనలు కనపడితే తాడుపెట్టి కట్టేసేది చిన్నతనంలో, సెనగలు తిననిచ్చేది కాదు. కుక్క కరచినవాళ్లు వానలో తడవకూడదట! సెనగలు తినకూడదట!

పెద్దవాడవుతున్నకొద్దీ చాలామంది కరిచారతణ్ణి. పరీక్షలు తప్పాడు. అందుకు ఎప్పుడూ ఏడవలేదు! అమ్మ యేడ్చింది. నానా అడ్డమైనవాళ్ళ దగ్గరనుంచీ చాలా చాలా గొప్పవాళ్ళవరకూ 'వట్టి అప్రయోజక శిఖామణివి' అన్నారు.

ఎవరిముందూ కాదనలేదు. కొందరిముందు అవునన్నాడు.

చిన్నప్పుడెప్పుడేనా క్లాసులో కూర్చుని పాఠాలు చెబుతున్న మాస్టర్ల హావభావ విలాసాలను బొమ్మలు గీసేవాడు.

దెబ్బలు తిన్నాడు.

కాలేజీకి వచ్చిన తర్వాత పాఠాలు చెబుతుంటే వొళ్లో పెట్టుకుని తలవంచుకొని, నవలలు చదివేవాడు.

ఆ తరువాత కథలు వ్రాశాడు. అమ్మనిగురించి వ్రాశాడు. అమ్మ అన్నది వోసారి – ''మావయ్యగారింటికి వెళ్ళు. శకుంతల నిన్నుచూడాలనుకుంటోందిట'' నిజమే ననుకొన్నాడు. మామయ్యగారింటికి వెళ్లాడు. శకుంతల పరీక్షలు ప్యాసైంది. చాలా అందంగా ఉంది. వారం రోజులున్న తర్వాత రేపు తిరిగి వద్దామనుకుంటుండగా, రాత్రి వెన్నెల వచ్చింది. వెన్నెట్లో చెట్లు. వెన్నెల బావుంది.

చంద్రకాంతపు మొక్కలున్నాయి. గోడవారగా ఐదో, ఆరో, అన్ని మొక్కలకీ ఒక్క పువ్వే ఉంది.

''అవి కోయలే దేం?'' – అని అడిగాడు శకుంతలని.

''తల్లిచెట్టుకి ఒక్కొక్క పూవైనా ఉంచాలి'' – అని చెప్పింది శకుంతల.

గదిలో కూర్చున్నారు. కిటికీలోంచి రోడ్డు దూరంగా కనిపిస్తున్నది. దూరంగా రోడ్డు మీద కంకరకొడుతున్న కూలివాళ్ళు పాటలు పాడుకుంటున్నారు.

''రేపు వెళ్లి పోతున్నాను'' అని చెప్పేడు.

చాలాసేపు మాట్లాడకుండా ఉండి చివరకిలా అన్నది శకుంతల.

''వాళ్ళు నయం బావా నీకంటే . చాలా నయం''

''ఎవరు వాళ్లు?''

''అదే. దూరంగా రోడ్డుమీద కంకర కొట్టుకుంటున్నారే వాళ్లు. దేశానిక్కూడా నీలా విషాదప్రేమకథలూ, నగ్నచిత్రాలూ రచించే వాళ్ళకంటే వాళ్ళే ఉపయోగం''.

తెల్లవారిన తరువాత ఊరెళ్ళిపోయినాడు. మళ్ళీ మామయ్యగారింటికి పోలేదు.

తరువాత యెప్పుడో శకుంతలకు పెళ్ళయింది.

చాలానాళ్ళ తరువాత స్టేషన్లో కనపడింది. ఇద్దరు పిల్లలూ, తానూ, దిగులుగా నవ్వుతూ ''పెళ్ళి చేసుకోవద్దు బావా, అదృష్టవంతుడివి కావాలంటే'' అని చెప్పింది.

త్వరత్వరగా వెళ్లిపోయాడు. ఇంటికిపోయిన తరువాత 'ఇద్దరు పిల్లల తల్లి' – అని బొమ్మ గీశాడు. అసహ్యంగా లావయి, చెక్కిళ్ళు గుంటలుపడి, ముఖం ముడతలుపడి దిగులుగా నవ్వుతూ...

తరువాత ఎన్నో వానలు కురిశాయి.

కిటికీతలుపులు కూడా మూసుకుని భద్రంగా గదిలో కూర్చున్నాడు. నాన్నకు విసుగ్గా ఉంది. అమ్మకు దుఃఖంగా ఉంది. పరీక్షలకీ చదవటం లేదు.

ఇంట్లో ఉండలేక ''ఉద్యోగం చేస్తా'' నన్నాడు.

''ఎవరిస్తా''రన్నాడు నాన్న వెటకారంగా.

అమ్మ పాదాలు కళ్ళకద్దుకొని మహానగరం వచ్చాడు కుర్రవాడు. పత్రికలలో కథలు పడుతున్నాయి.

బొమ్మలు గీస్తున్నాడు.

ఎక్కడో పాడుబడ్డకొంపలో బాగున్న గదిలో రాత్రుళ్ళు పడుకుంటాడు. వీధిపేరు అతడికి తెలీదు. వీధిపేరు తెలుసుకుంటే, ఇంటినెంబరు గుర్తుంటే అమ్మ దగ్గరనుంచి ఉత్తరం వస్తుంది. అందుకే వీధిపేరు తెలుసుకోలేదు. ఇంటికి ఉత్తరం వ్రాయలేదు. పోస్టుడబ్బాలు చూస్తే అందుకే భయం. ఉత్తరాలు గుర్తు వస్తాయి. అమ్మ గుర్తువస్తుంది. ఎన్నో గుర్తొస్తాయి. బ్రతుకుతున్నానన్న విషయం గుర్తొస్తుంది. వానచినుకులు గుర్తువస్తాయి.

ఎప్పుడేనా గోవిందు వెతుక్కుంటూ వచ్చి కథపడ్డ పత్రిక యిస్తాడు. పది రూపాయలిస్తాడు. ఎప్పుడేనా ఇంకో పది కావాలన్నా యిస్తాడు.

క్రిందటిసారి వానలో తడిసి మూడు నెలలు కాలేదు. ఆస్పత్రి నుంచి వచ్చి రెండు నెలలు కాలేదు.

మళ్ళీ వానవచ్చేలా ఉంది. అందుకే కుర్రవాడు గబగబా నడుస్తున్నాడు. అది బజారువీధి కాదు. పళ్ళదుకాణాలు లేవు. కిళ్ళీ షాపులు కూడా లేవు. అందుకే కుర్రవాడు గబగబా నడుస్తున్నాడు. అతడిపేరు ముకుందరావు. మహా నగరంలో ఉన్నాడు. ప్రస్తుతం వీధివెంట నడుస్తున్నాడు. ప్రస్తుతం ముకుందరావు వానలో తడిసే లోపున క్రిందటిసారి వానలో తడిసిన విషయం – ఇది కథ.

రోడ్డుమీద పరిగెత్తినా ముద్దముద్దగా తడిసిన ముకుందరావు పాడుపడ్డ ఇంటిలోని బాగున్న గదిలో ఆ రాత్రి పడుకుంటే పొద్దునకల్లా వొళ్లునొప్పులు పట్టి జ్వరం వచ్చింది.

ముకుందరావు గోవిందరావు ఇంటికి వెళ్ళాడు. నడిచే వెళ్లాడు జేబులో చిల్లర డబ్బులులేక. గోవిందరావు భార్య బయటజేరితే చచ్చినట్లు కుంపటి రాజేసుకుంటున్నాడు.

ముకుందరావు వెళ్ళి 'జ్వరం వచ్చిందిరా గోవిందూ' అని చెప్పాడు. గోవిందరావుకు కళ్ళనీళ్ళు వచ్చినయ్. కుంపటి రాజుకోక, భార్యను తిట్టుకుని, తనను తాను తిట్టుకొని, ముకుందరావును తిట్టి, ఆఫీసును తిట్టి, రిక్షా మాట్లాడి, పక్కనే కూర్చోబెట్టుకుని, ఆస్పత్రికి చేర్చి "వీడు చస్తే నాకు కబురు చేయం"డని డాక్టరు గారికి చెప్పి వెళ్ళిపోయాడు. ముకుందరావుకి యీసారి ఆస్పత్రి బావుంది. ఈ రోగం పెద్దదయితే తగ్గిపోయిందాకా హాయిగా యిక్కటే వుందును కదా-- అనుకున్నాడు.

రెండురోజులు పోయిం తర్వాత గోవిందరావు వచ్చాడు.

ఇంటికి ఉత్తరం వ్రాశాడట. అమ్మ ఉత్తరం వ్రాసింది. తెచ్చి యిచ్చాడు. ముకుందరావు చదవలేదు -- ఆ ఉత్తరంలో ఏముంటుందో అతడికి తెలుసు.

మళ్ళీ రెండురోజులు పోయింతర్వాత గోవిందరావు వచ్చాడు. నాన్న డబ్బు పంపించాడట. ఇచ్చిపోయాడు.

ఆ సాయంకాలం నర్సువచ్చి "నెలరోజుల దాకా ఇక్కడే వుండాలి మీరు" అని చెప్పింది.

"న్యుమోనియాలోకి దించుతుందేమోనని భయంగా ఉంది" అని చెప్పింది.

"భయమెందుకు?" అన్నాడు ముకుందరావు.

నర్సు తెల్లబోయింది. కళ్ళు విప్పార్చుకుని విచిత్రంగా చూసింది. అలా చూడటం ముకుందరావుకు బావుంది. చిన్నప్పుడు శకుంతల అలానే చూసేది. ఆస్పత్రి విషయాలు ఎన్నో తెలుసతడికి.

పేరేమిటని అడిగాడు నర్సుని. 'ఎందుకు?' అన్నది.

"చెప్పనవసరం లేదులే" అన్నాడు.

"అయితే చెపుతున్నాను... సరోజిని".


"ఈ ఉద్యోగం ఎందుకు చేస్తున్నావు?" చాలారోజుల తర్వాత ఆమె యీ ఉద్యోగం చెయ్యడం ఇష్టంలేనివాడులా అడిగాడు. ఆమె దిగులుగా చూసి వెళ్ళిపోయింది. నాలుగురోజులు ఆ ప్రశ్నని మరచిపోయాడు. ఐదో రోజున అడిగాడు. "ఈ ఉద్యోగం ఎందుకు చేస్తున్నావు?"

ఆమె దిగులుగా వెళ్ళి పోయింది. తరువాత ప్రతిరోజూ అడిగేడు. ఆమె చెప్పలేదు. అడిగేవాడు. ఆమెకు కోపం వచ్చింది.

"ఇలా అడిగితే యీ వార్డునుంచి డ్యూటీ మార్పించుకుంటాను".

"ఉద్యోగమే మానెయ్యరాదూ?"

ఆమె మౌనంగా వెళ్ళిపోయింది. మర్రోజు రాలేదు ఆమె. ఆ మరురోజూ రాలేదు. మూడో రోజూ రాలేదు. ముకుందరావు సంతోషించాడు. నిజంగా ఆమె ఉద్యోగం మానేసిందని.



ఆమె బావుంది. చాలా మంచిది. ఎందుకో ఆమె యీ ఉద్యోగం చెయ్యటం అతడికి యిష్టంలేదు. వారం రోజుల తర్వాత ఓ రోజు సాయంకాలం దీపాలు వెలిగిన తర్వాత. ఆరుగంటల తర్వాత---

రోగులను చూడటానికి వచ్చిన వాళ్ళవాళ్ళ బంధువులంతా దిగులైన ముఖాలతో వార్డులోంచి వెళ్ళిపోయిన తరువాత ఆమె వచ్చింది.

గోవిందరావు వెళ్ళిపోయాడు. అమ్మవ్రాసిన ఉత్తరం చదువుకుంటున్నాడతడు. ఆమె వచ్చింది.

ఉత్తరం దిండుకింద దాచి ఆమెకేసి చూశాడు.

కళ్ళు తుడుచుకుని చూసిన తర్వాత ఆమె ఆమెగా కన్పించిందతడికి. మళ్ళీ వచ్చింది. నిమిషం సేపు తలవంచుకుని, చిరునవ్వు తెచ్చిపెట్టుకుని ''తప్పకుండా తగ్గిపోతుంది లెండి. భయపడకండి'' అని చెప్పింది ఆమె.

''భయమెందుకు?'' అన్నాడతడు.

ఆమెకు దిగులైంది. వెళ్ళిపోయింది.

ఆమె ఏదో అడగాలని వచ్చింది. 'ఎక్కడనుంచి ఆ ఉత్తరం' అని.

''ఉద్యోగం మానెయ్యలేదూ?'' అని అడిగాతడు.

ఆమె తలవంచుకుని వెళ్ళిపోయింది. అతడు కళ్ళు తుడుచుకున్నాడు.

రాత్రి నిద్రపొమ్మని చెప్పటానికి వచ్చినప్పుడు మళ్ళీ అడిగాడు ''ఉద్యోగం మానెయ్యరాదూ?'' అని. ఆమె నవ్వింది.


''మానేస్తాను. పోనీ. మీరు చెప్పండి. భోజనం మీరు పెడతారా?''

అతడు ఆలోచనలో పడ్డాడు

ఆమె అతడివైపు కాసేపు ఉత్సుకతతో చూసి, గుండెలవరకూ దుప్పటిలాగి వెళ్ళిపోయింది.

అతడు పిలిచాడు.

వినిపించుకోకుండా ''నిద్రపోండి. ప్రక్క గదిలోనే ఉంటాను. అవసరమైతే పిలవండి'' అని ఆమె వెళ్ళిపోయింది.



ఐదునిమిషాలు కాకముందే అతడు పిలిచాడు. ఆమె వచ్చింది. ''ఉద్యోగం మానెయ్యరాదూ?''

ఆమె నవ్వింది. దిగులుగా, అందంగా, ఆహ్లాదకరంగా ''మిమ్మల్ని ఇక్కడనుంచి ఇంకో ఆస్పత్రికి మార్చమని డాక్టరు గారికి చెప్పనా?''

''ఎందుకూ?''

''పిచ్చాసుపత్రికి'' అతనూ నవ్వాడు. ఆమె వెళ్ళిపోయింది. నడిరాత్రివేళ అతడికి మెలకువ వచ్చింది.

ఎదురు బెడ్‌మీద చిన్న కుర్రవాడెవడో యేడుస్తున్నాడు. వాడికి పదేళ్ళుండవచ్చు. ఎవరికీ వినపడకూడదన్న వుద్దేశ్యంతో యేడుస్తున్నాడు. కాని ఆపుకోలేకపోతున్నాడు. ఎంత ఆపుకుందామన్నా వెక్కులు ఆగటం లేదు. మధ్యమధ్య అమ్మా, అమ్మా అంటున్నాడు.

ముకుందరావు ప్రయత్నించి కొద్దిగాలేచి వెన్నెముక క్రిందికి దిండ్లు లాగి పడుకున్నాడు. కుర్రాడివేపు చూస్తున్నాడు. కుర్రాడు ఏడుస్తున్నాడు. అమ్మా, అమ్మా అంటున్నాడు. ముకుందరావుకి కళ్ళలో నీళ్ళు తిరిగాయి. ప్రక్కకు తిరిగి కిటికీ లోంచి రోడ్డు మీదకు చూశాడు. చుట్టూ కలయజూశాడు. కొంతమంది నిద్రపోతున్నారు. కొంతమంది మూలుగుతున్నారు. కుర్రవాడు ఏడుస్తున్నాడు. కిటికీలోంచి కనిపిస్తున్న రోడ్డు మీద వెన్నెల కురుస్తున్నది. ముకుందరావు చూశాడు అమ్మా, అమ్మా అంటున్నాడు కుర్రాడు. ముకుందరావుకి అమ్మ గుర్తు వచ్చింది. అమ్మ ఏం చేస్తుంటుంది? పక్కమీద నిద్రపట్టక కన్నీళ్ళు పెట్టుకుంటూంది. దేవుడికి మొక్కుకుంటూంటుంది.

ఆస్పత్రి నుంచి వెంటనే బయటపడాలని, ఉద్యోగం దొరకాలని, పెళ్ళికావాలని, కోడలు రావాలని.

ఇంకా, ఇంకా....

ముకుందరావు కళ్ళు తుడుచుకున్నాడు.

రోడ్డు మీద రిక్షాపోతోంది. గంటలు మ్రోగించుకుంటూ.

''ఇంకా నిద్రపోలేదూ''

ముకుందరావు వెనక్కు తిరిగిచూశాడు.

''నిద్రపోండి. లేకపోతే టెంపరేచరు మళ్ళీ ఎక్కువవుతుంది''.

ముకుందరావు అడుగుదామనుకున్నాడు-

''ఈ ఉద్యోగం మానెయ్యరాదూ'' అని.

కాని ఆమె అక్కడ నుంచి వెళ్ళిపోయింది, ఎదురు బెడ్ మీది కుర్రాడి దగ్గరకు. ముకుందరావు ఆమె వేపే చూస్తున్నాడు.

''ఎందుకమ్మా ఏడుస్తున్నావు? నా తండ్రి కదూ! అమ్మ గుర్తొచ్చిందా, ఇదిగో ఇటుచూడు, నేనే అమ్మననుకో, బావుందా. యేం!'' వాణ్ణిగుండెల కదుముకొని వోదారుస్తోంది. వాడు ఏడుపు మానేశాడు.

ఎక్కువ కాంతిలేని ఆ లైట్ల వెల్తురులో ముకుందరావు ఆమె వేపే చూస్తున్నాడు. ఆమె కాంతివంతంగా కనిపిస్తోంది. అమ్మ గుర్తు వచ్చింది.

వెన్నెముక నొప్పి పుడుతున్నది. పడుకోవాలి. పడుకుంటే ఆమె కనపడదు. ముకుందరావు అలానే వున్నాడు.

పది పదిహేను నిమిషాల్లో కుర్రాడు నిద్రపోయినాడు. వాణ్ణి పడుకోబెట్టి ఆమె లేచింది. ముకుందరావు దగ్గరగా వచ్చింది.

''నిద్ర రావటం లేదూ-''

....... ......... .........

''నా ఉద్యోగం గురించే ఆలోచిస్తున్నారా?''

.............. ............... ........

''పోనీ మానేస్తాను. నిద్రపోతారా?''

ముకుందరావు మాట్లాడాడు. ''ఒకటడుగుతాను చెపుతావా?''

''ఒకటికాదు. పది అడగండి. మీకు నిద్రైనా పడుతుందేమో''

''నీకు నిద్రరాదూ?''

''భలే ప్రశ్న!''

''నువ్వెప్పుడైనా పాపం చేశావా?'' ఆమె వణికిపోయింది. ముకుందరావు చూశాడు. ఆమె కళ్ళు తుడుచుకోవటం లేదు. ముకుందరావు రోడ్డుమీదికి చూశాడు. వెన్నెల మబ్బు తెరల్లోంచి పాలిపోతూంది.

''నీకు రుక్మిణీ కళ్యాణంలో పద్యాలు వచ్చునా'' ఆమె నిశ్శబ్దంగా వొక్కొక్క అడుగే వేసుకుంటూ వెళ్ళిపోతూంది. దిండ్లు మెడకిందికి లాక్కుని ముకుందరావు

## యౌవనపు ఉద్వేగభరిత చిత్తవృత్తి



ఈ కథకు ఆధారమైన అంతఃశ్చేతన ఏమిటో ఇప్పుడు చెప్పడం కష్టం. అర్ధశతాబ్దం కింద అంటే ఏభై ఏళ్ల నాడు (1958) రాసిన కథ ఇది. ఈ కథ చాలా భాషలలోకి అనువాదం అయింది. అసలీ కథను రాయించిన వారు శ్రీ దేవులపల్లి కృష్ణశాస్త్రిగారు. ఆకాశవాణి ప్రసారం చేసే సాహిత్య కార్యక్రమం కోసం దీన్ని నాచేత రాయించారు. దక్షిణ భారత హిందీ ప్రచార సభవారు తమ పరీక్షల పఠనీయ పాఠ్య సంకలనంలో ఈ కథను చేర్చారు. తరుణ యౌవనపు ఉద్వేగభరిత ఆశా, నిరాశోపహత చిత్త వృత్తి ఈ కథలో చిత్రితమై ఉంటుంది. కథ పేరులో ప్రతీకాత్మకత ఊహ్యమే!

**-అక్కిరాజు రమాపతిరావు (మంజుశ్రీ)**

**040-27423352**

పడుకున్నాడు. అతనికి నిద్ర పట్టడం లేదు.

ఆమె వెళ్ళి గదిలో కుర్చీలో కూర్చుని కళ్లు తుడుచుకుంది. ఆమె ఆలోచిస్తున్నది.

''ఏమిటీ వింతమనిషి, పిచ్చివాడా? అన్ని వివరాలూ తెలుసుకోవాలి, ఇతడి గురించి'' ఆమెకు ఇంతలోనే అసూయ కలిగింది. తనకెందుకు? తెలుసుకుని తానేం చేస్తుంది? ఇంకో పదిరోజుల్లో యెలాగూ వెళ్ళిపోతాడు. ఇల్లు, సంసారం - భార్యను చూస్తాడు. ఆమె అతణ్ణిచూసి భోరుమంటుంది. ''ఎలా అయిపోయారు?'' అంటుంది. తరువాత అతడు తనని మరచిపోతాడు. ఆమె అలానే ఆలోచిస్తున్నది. తమ్ముడు గుర్తువచ్చాడు. తమ్ముడి కీ వూరు ట్రాన్స్‌ఫర్ కావటం నయమే. తాను ఉద్యోగం మానేస్తుంది. తమ్ముడూ మరదలూ వాళ్ళ మధ్య ఒంటరిగా తానెలా బ్రతుకుతుంది! తమ్ముడికి చదువు చెప్పించింది. లేకపోతే యీ ఉద్యోగం తనకెందుకు! వాడు ఉద్యోగంలో చేరాడు. తనని ఉద్యోగం మానెయ్యమనడేం? పెళ్ళిచేసుకున్నాడు. తనని పెళ్ళి చేసుకోమనడేం! ఎప్పుడైనా పాపం... ఏమో తనకు తెలీదు. ఆమె టేబిలు మీద తలవాల్చి ఆలోచిస్తుంది.

ముకుందరావుకు నిద్ర పట్టడం లేదు.

''ఆమె యెందుకు ఉద్యోగం చేయాలి? ఆమె భర్త ఏమనుకుంటాడు? జీవితం ఎన్నాళ్ళిలా గడపాలి? 'ఇద్దరు పిల్లల తల్లి' లా ఆమె మాత్రం అయిపోదూ? ఎన్నాళ్ళిలా... ఎన్నాళ్ళిలా... ఏమిటీ జీవితం?''

మర్రోజు ప్రొద్దున్నే ముకుందరావు కాగితం కలం తీసుకున్నాడు. టెంపరేచరు నార్మల్‌లో వుంది.

సాయంకాలం ఆమె వచ్చింది. సంతోషంగా వచ్చింది. ''మీకు జ్వరం తగ్గిపోయింది. టెంపరేచరు చార్ట్ చూసి వచ్చాను. నాలుగు రోజుల్లోనే మీరిక్కడి నుంచి హాయిగా వెళ్ళిపోవచ్చు''.

ముకుందరావు నవ్వాడు.

ఆమెకు తాను గీసిన బొమ్మ చూపాడు.

''ఉద్యోగం వదిలేసిన నర్సు''.

ఆ బొమ్మలో తానేవుంది. ఎవరో మగవాడు. తనచుట్టూ ఇద్దరూ ముగ్గురు పిల్లలు. వాళ్ళని పిల్లలనుకోవాలి -- రేఖలు.

ఆమెకు సంతోషమైంది. అతడికేసి, ఆశ్చర్యంగా కళ్ళు విప్పార్చుకుని చూసి ''బొమ్మలు బాగా వేస్తారే!'' అంది.

కళ్ళు ఇంకా పెద్దవిచేసి ''నాకు ఇల్లులేదు. సంసారం లేదు. పెళ్ళికాలేదు. తెలుసా?'' ఆమె వెళ్ళిపోయింది. ఆ బొమ్మ గీచిన కాగితం జాగ్రత్తగా తీసుకుని, పోతూ పోతూ ''ఇది నాకు కావాలి'' అంది.

ముకుందరావుకి ఆశ్చర్యమైంది. సంతోషం కలిగింది. ఆవేళ రాత్రి ఎదురు బెడ్ మీద వున్న కుర్రవాడు మళ్ళీ యేడ్చాడు. ఆమె వచ్చింది. ''ఎందుకమ్మా యేడుస్తున్నావు? నేనే అమ్మననుకో'' ముకుందరావు ఆమె వేపు చూస్తున్నాడు. రోజూ కుర్రవాడు యేడుస్తున్నాడు. రేపు వెళ్ళిపోతాననగా ఆ రాత్రి ఆమె చేతిని కావాలని మృదువుగా నొక్కి హాయిగా నిద్రపోయాడు ముకుందరావు -- ఇది క్రిందటిసారి వానలో తడిసిన కథ. ఇప్పుడు.

ముకుందరావు రోడ్డు మీద నడుస్తున్నాడు. బ్రిడ్జి వచ్చింది. బ్రిడ్జి దాటాడు. ఏమీ దుకాణాలు లేవు. గవర్నమెంటు క్వార్టర్స్ కనిపిస్తున్నాయి. ఒక పెద్ద చినుకు వచ్చి మీద పడింది. ముకుందరావు పరిగెత్తాలనుకున్నాడు. నడుస్తున్నాడు. గాలి చల్లగా శరీరాన్ని తాకుతున్నది. మీద రెండు చినుకులు పడ్డాయి. ముకుందరావు గబగబా నడుస్తున్నాడు. నాలుగు చినుకులు పడ్డాయి. ముకుందరావుకు హాయిగానే వుంది. అయిన భయంగానే వుంది. ఇంకా నడక వేగం హెచ్చించాడు.

వీధిలో దీపాలో వెలిగాయి. చీకటి పడుతున్నది. వాన కురవ బోతున్నది. ఒక చెట్టు కనపడుతున్నది. ఆ చెట్టుక్రింద అప్పటికే ఒకరు నిలుచుని వున్నారు. చిన్న పళ్ళెంలో యేవో అమ్ముకునే వాడులా వుంది. ముకుందరావు పోయి ప్రక్కనే నిలుచున్నాడు. చినుకులు పడుతున్నాయి. ముకుందరావుకి విసుగ్గా వుంది. ఎదురుగా క్వార్టర్స్ కనపడుతున్నాయి. క్వార్టర్స్‌లో దీపాలు కనపడుతున్నాయి. వాన కురుస్తున్నది. తన పక్కన నిలుచున్న మనిషి వేపు చూశాడు. అతని పైన చినుకులు పడటం లేదు. అతని చేతుల్లోని పళ్ళెంవేపు చూస్తే వేయించిన శనగలు వున్నవి. ముకుందరావు జేబు తడుముకున్నాడు. ముకుందరావు పక్కన నిలుచున్న మనిషి పక్కకు జరిగాడు. ముకుందరావు శనగలు కొనుక్కొని జేబులో పోసుకున్నాడు. ఇప్పుడు ముకుందరావు మీద చినుకులు పడటం లేదు. పక్కనున్న మనిషి పళ్ళెం మీద గోనెపట్టా కప్పుకొని క్వార్టర్స్ వేపు పరిగెత్తేడు. ముకుందరావుకి హాయిగా వుంది. ఒక నిముషం, రెండు నిమిషాలు. వాన పెద్దదయింది. ముకుందరావు క్వార్టర్స్ వేపు పరిగెత్తాడు.

సెనగలమ్ముకుంటున్న మనిషి యే ఇంట్లోనూ కనిపించలేదు. అన్నివాకిళ్ళూ మూసి వున్నాయి. ముకుందరావు తడుస్తున్నాడు. వాన పెద్దదయింది.

చప్పున ఓ యింటిదగ్గర ఆగిపోయాడు. వాకిలి తెరిచే వుంది. గడపలో నిలుచున్నాడు. వానమీద పడటం లేదు. జేబురుమాలుతో తుడుచుకుంటూ ఇంట్లోకి చూశాడు. లైటు వెలుగుతోంది. సోఫాలో ఎవరో అమ్మాయి కూచుని కథల పత్రిక చదువుతోంది. ఆ అమ్మాయి ముకుందరావు వేపు చూసింది. కళ్ళలో ఎంతో అసహ్యం. ఆ అమ్మాయి తనవేపు చూడటంతో, ఆ అమ్మాయి చదువు తున్న కథ వైపు చూశాడు ముకుందరావు. చిత్రం! ఆ కథ తను వ్రాసిందే. ఆ అమ్మాయి మళ్ళీ చదువుకుంటోంది. ఆ అమ్మాయి వేపు చూశాడు. ఆ అమ్మాయి ముఖం దీనంగా మారిపోయింది. ఆ దుఃఖగాథను తెలుచుకొని, ఆ అమ్మాయిని చూస్తూ ముకుందరావు చెప్పలేనంత సంతోషపడ్డాడు. ఆ అమ్మాయి చప్పున యితడివేపు తిరిగి ''పక్కన వరండా వుంది. అక్కడ పోయి నిలుచోండి...'' ముకుందరావుకు దిగులైంది. ఆ కథ తాను వ్రాసిందే! ముకుందరావు కదలబోయాడు.

వెనకనుంచి ''ఓ.. మీరా...''

క్షణంసేపు ఆగి ''వానలో తడుస్తున్నారా'' కోపంతో కూడిన లాలనతో.

ఆమె సరోజిని. అప్పుడే లోపలినుంచి వచ్చింది.

''కూచోండి. టవల్ తెస్తాను. మా మరదలే లెండి.... నీవు పోయి కాఫీ కలుపమ్మా...''

ముకుందరావు గోడవారగా నిలుచున్నాడు. సరోజిని మరదలు లోపలికి వెళ్ళింది. చాలా ఆశ్చర్యంతో, కొంచెం బాధతో, కొంచెం సిగ్గుతో.

''మీ కథను రోజూ చదువుతుంది. చాలా ఇష్టం ఆవిడకు'' ముకుందరావు మాటాడలేదు.

''నేను ఉద్యోగం మానేశాను తెలుసా?'' ఆమె నవ్వుతోంది.

''ఇప్పుడు చెప్పండి. నాకు భోజనం ఏర్పాటు చేస్తారా?''

ముకుందరావుకి సంతోషమైంది. సరోజిని టవలు తెచ్చి యిచ్చి లోపలికి వెళ్ళిపోయింది. ముకుందరావు తుడుచుకోవటం లేదు. ముకుందరావుకు ఎన్నెన్నో గుర్తు వస్తున్నాయి. అమ్మకు ఉత్తరం వ్రాయాలి. రెండురోజుల క్రితం గోవిందు చెప్పిన ఉద్యోగం విషయం గట్టిగా కనుక్కోమని చెప్పాలి. ఉత్తరం... ఉత్తరం... అమ్మకు... ముకుందరావు కాసేపు సరోజిని నిష్క్రమించిన వాకిలివేపు చూశాడు. లోపల స్టవ్ మండుతోంది. ఆ అమ్మాయి వదిలేసిన పత్రిక వేపు చూశాడు. బయట కురుస్తున్న వానవేపు చూశాడు. ముకుందరావు ఆలోచించుకున్నాడు. సరోజిని రాలేదు.

ముకుందరావుకి సంతోషం పొంగిపోతోంది. గోవిందు దగ్గరకు పోవాలి. అమ్మకు ఉత్తరం వ్రాయాలి. లోపల స్టవ్ మండుతోంది. ఎవరూ బయటకు రాలేదు. రెండు నిమిషాలు కూడా గడపక ముందే ముకుందరావు రోడ్డు మీద తడుస్తూ నడుస్తున్నాడు.

★